

అప్పాయిపల్లిలో సాగు చేసిన కీరపంట

ధర లేక దిగాలు

- కీరసాగుకు ఎకరాకు రూ.25వేల నుంచి రూ.35వేలు ఖర్చు
- పెట్టుబడి కూడా రాకపోవడంతో పంటను పొలంలోనే దున్నుతున్న రైతులు

దౌల్తాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి సాగు చేసిన కీర పంటకు ధర లేకపోవడంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయి. దౌల్తాబాద్ మండల పరిధిలోని అప్పాయిపల్లిలో సుమారు పదెకరాల్లో రైతులు కీర పంటను సాగు చేశారు. పంట సాగు కోసం ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్ ధర లేక కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పంటను మార్కెట్‌కు తరలిస్తే రవాణా ఖర్చులు అదనం. దీంతో రైతులు పంటను పొలంలోనే కలియదున్నుతున్నారు. గతేడాది ఎకరాకు రూ.50వేల నుంచి రూ.70వేల వరకు ఆదాయం వచ్చేదని, ఈ సారి నష్టమే మిగిలిందని అప్పాయిపల్లి వాపోతున్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామదాస్ అథవాలే

రోడ్డు ప్రమాదాల్లో ఏటా రెండు లక్షల మంది మృతి

- కేంద్ర మంత్రి రామదాస్ అథవాలే

సిద్దిపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో రెండు లక్షల మంది మరణిస్తున్నారని కేంద్ర మంత్రి రామదాస్ అథవాలే అన్నారు. వాహనాలు నడిపే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించాలని.. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌కు చెందిన ఆర్‌పీఐ జాతీయ సమన్వయకర్త, తెలంగాణ ఇన్‌చార్జి కొంపెల్లి ప్రభుదాస్ కుమారుడు సాగర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కేంద్ర మంత్రి గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుదాస్ కుటుంబానికి ఆర్‌పీఐ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. అంతకు ముందు కేంద్ర మంత్రికి ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఎంపీడీవో శ్రీరాములు స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి వెంట ఆర్‌పీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి కుమార్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు రోజా, ఉపాధ్యక్షురాలు స్నేహలత, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఖాదార్, ఆర్‌పీఐ నాయకులు, గ్రామ నాయకులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

దాబాలో మత్తు పదార్థాలు

- హెరాయిన్ తయారీకి ఉపయోగించే పౌడర్ స్వాధీనం

మాసాయిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలోని జాతీయ రహదారి 44పై ఉన్న ఓ పంజాబీ దాబాపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టీం గురువారం దాడి చేసి హెరాయిన్ తయారీలో వినియోగించే పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాబా మేనేజర్ రవీందర్‌సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల కథనం ప్రకారం.. మాసాయిపేట జాతీయ రహదారిలోని షేర్-ఏ-పంజాబీ ఫ్యామిలీ దాబాపై మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందం దాడులు నిర్వహించింది. దాబాలో నిల్వ ఉంచిన హెరాయిన్ తయారీలో వినియోగించే 128 గ్రాముల పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో మెదక్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టీం సీఐ పి.వీణారెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్, ఆజం, గోపాల్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లు అయినా.. ఇంకా ఏపీ ఆన్‌లైనే..

- బయోమెట్రిక్‌లో మారని రాష్ట్రం

నారాయణఖేడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ధం దాటిన పోస్టల్ శాఖ బయోమెట్రిక్ యంత్రాలలో ఏపీ ఆన్‌లైన్‌గానే నమోదై ఉన్నాయి. పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న అనంతరం రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. రాష్ట్రం ఏర్పడిన అనంతరం అన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డులతోపాటు అన్ని ధ్రువపత్రాలపై తెలంగాణగానే ఉంది. వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మార్పులు చేసింది. తాజాగా పోలీసు అధికారుల బ్యాడ్జీలపై కూడా టీఎస్ నుంచి టీజీగా మార్చారు. అయితే, పోస్టల్ శాఖకు సంబంధించి గ్రామాల్లో అందించే వివిధ రకాల పింఛన్లను పంపిణీ చేయడానికి వినియోగించే బయోమెట్రిక్ యంత్రాలలో ఇప్పటి వరకు కూడా ఏపీ ఆన్‌లైన్‌గానే ఉండటం విమర్శలకు తావిస్తోంది.



కరెంటు కోతలు

'జిల్లాలో ఎప్పుడు కరెంటు ఉంటుందో.. ఎంతసేపు ఉంటుందో తెలియని పరిస్థితి. గంటల తరబడి కోతలు విధిస్తుండడంతో జనం దిక్కుతోచకున్నారు. చిటికిమాటికి కరెంటు కోతలు విధిస్తుండడంతో వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. సిద్దిపేట జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత, వివిధ కారణాల పేరిట రోజుకు దాదాపు మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. మధ్యమధ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అయ్యాయంటూ కరెంటు సరఫరా నిలిపివేస్తున్నారు. విద్యుత్‌పై ఆధారపడి పనిచేస్తున్న పలువురు వ్యాపారులు, కూలీలు సకాలంలో పనిచేసుకోలేక సతమతమవుతున్నారు. తమ వ్యాపారాలు, పనులు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు.

- సిద్దిపేట టౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి):

- వినియోగదారులకు తప్పని ఇక్కట్లు
- గ్రామాలు, పట్టణాల్లో మెయిన్‌టెనెన్స్ పేరిట విద్యుత్ సరఫరా కట్
- ఒక్కోసారి 3 గంటల పైనే కోత
- స్పందించని విద్యుత్ అధికారులు



విద్యుత్ సరఫరాలో అంతరాయం పేరిట అధికారులు పంపిన మెసేజ్

సిద్దిపేట పట్టణంతో పాటు పలు గ్రామాల్లో పదిహేను రోజుల నుంచి విద్యుత్ సరఫరాను 24 గంటలపాటు అధికారులు అందించలేకపోతున్నారు. సబ్‌స్టేషన్లలో మెయిన్‌టెనెన్స్ పేరిట దాదాపు 3 గంటలకు పైగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. సిద్దిపేటలో నాటిన మొక్కలు పెరిగి పెద్దగా అవ్వడంతో, విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని, కొమ్మలను నరికేసేందుకు మున్సిపల్ సిబ్బంది సూచన మేరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నారు. ఒక్కోసారి ఉదయం 8, 9, 10 నుండి 11.30 నుంచి 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరా ఉండకపోవడంతో తమ పిల్లలకు మధ్యాహ్నలోపు టిఫిన్ బాక్సులు అందడం లేదని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిఫిన్ సెంటర్లు నిర్వహించే వ్యాపారులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని రోజులుగా ఇదే తంతు..

పట్టణంలోని 43వార్డుల్లో నిత్యం ఏదో ఒక చోట ఎప్పుడు పడితే అప్పుడు చెట్ల కొమ్మలను కట్ చేస్తూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నారు. గ్రామాల్లో 33/11కేవీ లైన్ మరమ్మతులు, సబ్‌స్టేషన్ మెయిన్‌టెనెన్స్ పేరిట కరెంటు కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్కోరోజు ఒక్కో మండలం లేదా ఒక్కో గ్రామం చొప్పున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.

స్పందించని ఉన్నతాధికారులు

సిద్దిపేటలోలో గంటల తరబడి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నా, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు

మిగతా 8వ పేజీలో...

యమపాశాలుగా విద్యుత్ తీగలు

- చేతికి అందే ఎత్తులో కరెంటు వైర్లు!
- ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు.. ఆందోళనలో రైతులు

8

వసతి గృహాల్లో సమస్యల తిష్ఠ



పై అంతస్తులో నిర్మాణానికి నోచని గదులు వృథాగా పడి ఉన్న ఐరన్ బెడ్‌లు

మద్దూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాభివృద్ధికి వసతి గృహాల ఏర్పాటుతో పాటు అనేక విధాలుగా కృషి చేస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల అలసత్వం, గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడిగా సరైన సౌకర్యాలు అందకుండా పోతున్నాయి. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో మోడల్‌స్కూళ్లలో చదువుకుంటున్న విద్యార్థినుల కోసం 2016లో వసతి గృహాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా జిల్లాలో 14 వసతిగృహాలు మంజూరు కాగా మద్దూరు మండల కేంద్రంలోనూ వంద మంది విద్యార్థినులకు సరిపడేలా రెండతస్థుల హాస్టల్‌ను నిర్మించారు. అయితే, పై అంతస్తులో పనులు ప్రారంభం కాకముందే అధికారులు 2018లో హాస్టల్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత ఆ పనులను పూర్తిచేయకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.



మద్దూరు మోడల్‌స్కూల్ ఆవరణలో ఉన్న బాలికల వసతి గృహం

హాస్టల్‌లో 100 మంది విద్యార్థినులకు సౌకర్యం కల్పించాల్సి ఉండగా కేవలం 50 మందికి సరిపడా వసతులే ఉన్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లో కిచెన్, డైనింగ్‌హాల్, ఆఫీసు, స్టోర్ రూంతో పాటు మెడికల్ రూం, విద్యార్థినుల బసకు 10 గదులున్నాయి. పై అంతస్తులో 7 గదుల నిర్మాణాలు పూర్తయినా కిటికీలకు ఇనుపజాలితో పాటు తలుపులు లేవు. మరో 4 గదులు అసలు నిర్మాణానికి నోచుకోలేదు. హాస్టల్ ప్రారంభంలో 40 బెడ్లు, కార్పెట్లు, బెడ్‌షీట్లు అందించారు. ఆ తర్వాత మరో డబుల్ బెడ్స్ 16 అందించారు. ఆ తరువాత నుంచి అంటే ఆరేళ్లుగా బెడ్‌షీట్లు, కార్పెట్లు, కాస్మోటిక్ చార్జీలు అందలేదు. విద్యుత్ సౌకర్యం మెరుగ్గా లేదు. నీటివసతి లేక ఇబ్బందులు పడుతుంటే మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి బోరు మంజూరు చేయించారు.

కోతులతో తిప్పలు

హాస్టల్ చుట్టూ పెరిగిన చెట్లతో కోతుల తీవ్రత ఎక్కువగా ఉంది. అలాగే వంట తయారీ సమయంలో కోతులతో తిప్పలు తప్పడం లేదు. సోలార్ హీటర్ సౌకర్యం ఉన్న

మిగతా 8వ పేజీలో...

పురుగుల అన్నం.. కుళ్లిన కూరగాయలు

- మైనారిటీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థినుల అవస్థలు



అన్నంలో పురుగులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని బాలికల మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కనీస వసతులు కరువయ్యాయి.. దీనికి తోడు కుళ్లిపోయిన కూరగాయలు, పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థినులు ఆవేదన చెందుతున్నారు. ఉడికీ ఉడకని అన్నంతో కడుపు నిండా తినలేకపోతున్నామని వాపోతున్నారు. కనీసం బాత్‌రూంలకు తలుపులు కూడా సరిగ్గా లేవు. చలికాలంలో కూడా విద్యార్థినులు చన్నీటి స్నానం చేయడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ విషయ మై ప్రిన్సిపాల్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



కుళ్లిపోయిన క్యాబేజీ



విరిగిన బాత్‌రూం తలుపులు

సిరుల పట్టు..

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ధీటుగా పట్టు రైతుల ఆదాయం
- నెలకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు సంపాదన
- జిల్లాలో 1160 ఎకరాల్లో సాగు
- మల్బరీ సాగులో రాష్ట్రంలోనే సిద్దిపేట ప్రథమ స్థానం
- గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు జీవనోపాధిగా పట్టు పరిశ్రమ

తొగుట, నవంబరు 21: జిల్లాలోని రైతులు క్రమంగా మార్పునకు శ్రీకారం చుడుతున్నారు. ఒకప్పుడు యేటా ఒకేపంటను సాగుచేసి దానిని కాపాడుకోవడానికి నానా కష్టాలు పడేవారు. అలాగే కోతులు, అడవిపందులు చేసే నష్టం కూడా అంతాఇంతాకాదు.. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారించాలని అధికారులు కూడా రైతులకు నిత్యం అవగాహన కలిస్తూనే ఉన్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేసి లాభాలు ఆర్జించే విధంగా రైతుల్లో చైతన్యం నింపుతున్నారు. జిల్లాలోని రైతులు, గ్రామీణ ప్రాం తాల్లోని నిరుద్యోగులు పట్టు పరిశ్రమవైపు మొగ్గు చూపుతున్నారు. పట్టుగూళ్లకు విపరీతమైన ధర పలుకుతుండడం కూడా రైతులు ఆసక్తి చూపడానికి ఒక కారణం. ఫలితంగా ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జీతానికి సరిసమానంగా పట్టు రైతులు అర్జిస్తున్నారంటే అతిశయోక్తి కాదు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకాకముందు జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో మల్బరీతోటలు సాగయ్యేవి. ప్రస్తుతం దుబ్బాక నియోజకవర్గంలో 150 ఎకరాలు, సిద్దిపేట నియోజకవర్గంలో 456 ఎకరాలు, గజ్వేల్ నియోజకవర్గం 180 ఎకరాలు, జనగామ నియోజకవర్గంలోని చేర్యాల డివిజన్‌లో 126 ఎకరాలు, హుస్నాబాద్ నియోజకవర్గంలో 248 ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు.

రూ.లక్షల్లో ఆదాయం

జిల్లాలో సుమారు 370 మంది రైతు కుటుంబాలు మల్బరీ తోటలను సాగుచేస్తున్నాయి. మల్బరీ సాగుతో రైతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీరుకు ధీటుగా ఆదాయం పొందుతున్నారు. ఎకరాలో మల్బరీ సాగుకు ఏడాదికి రూ.80వేలు పెట్టుబడి అవుతుండగా సంవత్సరానికి రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. రెండు, మూడు అంత కన్నా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతుల ఆదాయం కూడా భారీమొత్తంలో ఉంటుంది. ఎకరా వరిసాగుచేసే నీటితో 3 నుంచి 4 ఎకరాల్లో మల్బరీ సాగుచేసుకోవడానికి వీలుంటుంది. ఒకసారి మల్బరీతోటను నాటితే 15 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకు పట్టుగూళ్లను ఉత్పత్తి చేసుకునే అవకా శం ఉంది. ఎకరానికి సుమారు 5,500మొక్కలను నాటవచ్చు.



చిన్నకోడూర్ మండలం చంద్లాపూర్ గ్రామంలో మల్బరీతోట వద్ద వేసిన షెడ్డు



కోహెడ మండలం శనిగరం గ్రామంలోని షెడ్డులో సాగు చేసిన పట్టుగూళ్లను చూపిస్తున్న అధికారులు

నిరుద్యోగులకు ఉపాధి

మల్బరీతోటలు అన్నిరకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుని పెరుగుతాయి. పట్టుపరిశ్రమ వల్ల ప్రతినెలా ఆదాయం పొందే అవకాశముంది. ఏడాదికి కనీసం 5 నుంచి 10 పంటలు తీసుకోవచ్చు. మల్బరీ తోటల పెంపకానికి ఉపాధిహామి పథకం అనుసంధానం చేయడంతో పాటు పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తోంది. డ్రిప్, స్ప్రింక్లర్, షెడ్డు నిర్మాణానికి ఎస్సీలకు 65 శాతం సబ్సిడీ, మిగతా వారికి 50 శాతం సబ్సిడీపై నిధులు మంజూరు చేస్తుంది.




రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పంట మార్పిడి కోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో కంటే ఈసారి జిల్లాలో మల్బరీ సాగు విస్తీర్ణం పెంచాం. రైతులకు పట్టు మంచి ఆదాయాన్ని సమకూరుస్తుంది. జిల్లాలో 35 ఏళ్లుగా సిబ్బంది రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం తగినంత సిబ్బందిని నియమిస్తే ఇంకా మల్బరీ సాగు పెరిగే అవకాశం ఉంటుంది.

- నిమ్మ ఇంద్రసేనారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా సెరికల్చర్, అసిస్టెంట్ డైరెక్టర్

పట్టుతోనే ఉపాధి పొందుతున్నాం



రెండెకరాల్లో మల్బరీతోటలు సాగుచేశాం. మా కుటుంబం మొత్తానికి ఉపాధితో పాటు ప్రతినెలా ఆదాయం పొందుతున్నాం. ప్రభుత్వ అధికారుల సలహాలు, సూచనలతో మంచి దిగుబడి సాధిస్తూ ఆర్థికంగా బలపడుతున్నాం.

- బొగ్గుల నర్సింహులు, రైతు (చంద్లాపూర్)

క్రమశిక్షణకు మారుపేరు పోలీసుశాఖ

అంకితభావంతో పనిచేసి మెప్పు పొందండి

మహిళా భద్రతా విభాగం డీఐజీ రాజేశ్వరి

7



చలికాలం గుండె పదిలం

అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

7



విద్యారంగాన్ని చిన్నచూపు చూడటం తగదు

చేర్యాల, నవంబరు 21: ప్రభుత్వం విద్యారంగాన్ని చిన్నచూపు చూడడం తగదని ఏఐఎస్ఎఫ్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చేర్యాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన విజయోత్సవాలకు ఉన్న డబ్బులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలకు లేవా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శిరీష, ఎద్దు కార్తీక్, పోతుగంటి సాయికిరణ్ ఉన్నారు.



చేర్యాలలోని ఓ కళాశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న నాయకులు

పత్తి తీసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తి తీసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పత్తి తీసే రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన పత్తిరకాలు దఫాదఫాలుగా పంట పూతకు రావడం వల్ల కనీసం మూడు నుంచి నాలుగు సార్లు పత్తిని తీయవలసి ఉంటుందని, రైతులు వేసే పత్తి రకాలను బట్టి తీసే సమయం ఆధారపడి ఉంటుందన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు.



జగదేవ్‌పూర్: పత్తి తీస్తున్న మహిళా రైతులు

● దౌల్తాబాద్: ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవొద్దని దౌల్తాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి సాయికిరణ్ అన్నారు. ఏవో, ఏఈవోలు గురువారం మండలంలోని తిర్మలాపూర్, లింగారాజుపల్లి, దౌల్తాబాద్, మల్లేశంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తేమను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు పడాల రాములు, ఏఈవోలు సంతోష్‌కుమార్, శిరీష, రాంప్రసాద్, రైతులు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని ఆదర్శ పాఠశాలను మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన లాంగ్‌జంప్ పిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంవో మంజరి, రవికుమార్, పాఠశాల ప్రిన్సిపాల్స్ కాట స్లీవరాజు, రాము, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



పాఠశాలలో లాంగ్ జంప్ పిచ్‌ను ప్రారంభిస్తున్న ఆదర్శ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గప్రసాద్

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన నలుగురికి జరిమానా

బెజ్జంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన నలుగురికి హుస్నాబాద్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణాతేజ్ రూ. 15 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని ముత్తన్నపేటకు చెందిన ఓ మహిళతో ముత్తన్నపేటకు చెందిన కనగండ్ల సురేందర్, మచ్చ కుమార్, చీలాపూర్‌కు చెందిన శానగొండ శరత్, బెజ్జంకి ఎక్స్ రోడ్డుకు చెందిన మ్యాకల శ్రీకాంత్ అసభ్యంగా ప్రవర్తించారు. సదరు మహిళ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 2017లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు విచారణ జరుగుతున్నది. విచారణలో భాగంగా గురువారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన హుస్నాబాద్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణాతేజ్ వారికి రూ. 15 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు సిద్దిపేట విద్యార్థినులు


సిద్దిపేట కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిమెదక్ జిల్లా స్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో కె. పూజిత, జి. హారిక, జె. పూజ, ఎల్. శృతి, పి. ఉమామహేశ్వరి, జి. కృష్ణవేణి బంగారు పతకాలు సాధించారు. ద్వితీయ స్థానంలో కె. సైనా, యూ. అశ్విక, బుష్రా ఫాతిమా, సోఫియా, డి. అనూష, కె. రేఖ, జె. జ్యోతి, ఈ. అనూష సిల్వర్ పతకాలు సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ సుజాత తెలిపారు. వీరంతా రాష్ట్రస్థాయిలో పోటీ పడుతారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు నీలకంటి మనోహర్, అధ్యాపక బృందం అభినందించారు.




విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపక బృందం


రంగనాయకుల ఆలయం వద్ద నేటికీ ఠీవిగా నిలిచిన పశ్చిమ ద్వారం


పట్టణం చుట్టూ నిర్మించిన కోట గోడలు శిథిలంగా మారిన దృశ్యం


ఉత్తర ఈశాన్యంలో నిర్మించిన మహాద్వారం


దక్షిణ భాగంలో నిర్మించిన మహా ద్వారం



చరిత్ర.. చెక్కు చెదురుతోంది..

జోగిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అందోలు.. అభివృద్ధి పథంలో ఎన్ని మార్పులు వచ్చినా.. ఇదో చారిత్రక పట్టణం. రెడ్డి రాజుల కాలంలో సంస్థానంగా ఓ వెలుగు వెలిగిన ఈ పట్టణం నేటికీ చరిత్రకు ఆనవాలుగా మిగిలి ఉంది. అయితే, నాటి చరిత్రను, అప్పటి కట్టడాలను కాపాడి భావి తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత ఉండగా, ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి.

అందోలును శత్రు దుర్భేద్యంగా మార్చేందుకు నాటి రెడ్డి రాజులు పట్టణం చుట్టూ కోట గోడ కట్టారు. పట్టణంలోనికి ప్రవేశించేందుకు మూడు వైపులా నిర్మించిన బురుజులతో కూడిన గౌనిలు నాటి చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పట్టణం చుట్టూ సుమారు 30 అడుగుల ఎత్తులో కోట గోడ నిర్మించగా, పట్టణానికి ఈశాన్యంలో కొట్టాలకు వెళ్లే మార్గంలో ఒకటి, రంగనాథాలయానికి చేరే విధంగా పశ్చిమాన మరొకటి, దక్షిణాల ఇంకో గౌని ఇప్పటికీ కనిపిస్తాయి.

అందోలు చుట్టూ ఆనాడే కోటగోడ
మూడు వైపులా ప్రవేశానికి గౌనిలు
పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు..

అప్పట్లో వీటికి ఏర్పాటు చేసిన తలుపులు ఏనుగులు కూడా విరగ్గొట్టలేకపోయేవని చెబుతారు. కోట గోడ ఎక్కేందుకు కూడా వీలు లేకుండా గోడ చుట్టూ సుమారు ఆరు అడుగుల మేర కందకమూ నిర్మించి, అందులో నీటిని వదిలేవారని చెబుతారు.

శిథిలావస్థకు..

అందోల్ రక్షణగా కట్టిన నాటి గోడ శిథిలమై ఆనవాళ్లు లేకుండా పోతోంది. ప్రస్తుతం ఈ గోడ కూలడానికి సిద్ధంగా ఉంది. పట్టణం మధ్యలోని సిద్ధిమహల్‌గా పిలుచుకునే అంతఃపురం ఇప్పుడు కనిపించకుండా పోయింది. ఇక గౌనీలు సైతం శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈశాన్యం, దక్షిణ భాగాల్లోని గౌనీలు ఇంకా ఉన్నా..వాటిపై చెట్లు మొలిచి.. శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, పురావస్తు శాఖ అధికారులు స్పందించి ఈ చరిత్ర సాక్ష్యాలను కాపాల్సిన అవసరం ఉందని పట్టణవాసులు కోరుతున్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

భూమికి బదులు భూమి ఇవ్వాలి
గౌరవెల్లి కింద భూములు కోల్పోతున్న రైతులు

అక్కన్నపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి భూములు కోల్పోతున్న వారికి భూములు బదులుగా భూములు ఇవ్వాలని రైతులు కోరారు. గురువారం అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామపంచాయతీ ఆవరణలో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ కింద భూములు కోల్పోతున్న రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు హాజరైన హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి మాట్లాడుతూ అంతకపేట గ్రామంలో గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ నిర్మాణానికి 5.01 ఎకరాల భూమి సేకరిస్తున్నామని తెలిపారు. కాలువ నిర్మాణానికి తీసుకునే భూములకు మార్కెట్ విలువకు మూడింతలు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని చెప్పారు. భూములకు బదులు భూములు ఇవ్వడం కుదరదని రైతులకు సర్ది చెప్పారు. గ్రామసభలో తహసీల్దార్ అనంతరెడ్డి, ఇరిగేషన్ డీఈ కరుణ, నాయబ్ తహసీల్దార్ అరవింద్, ఆర్ఐ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆప్తాల్మిక్, ఇమేజింగ్ అభ్యర్థులకు నేడు-రేపు కౌన్సెలింగ్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ అప్లికేషన్స్ పెట్టుకున్న అభ్యర్థులకు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.సుధామాధురి ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ అప్లికేషన్స్ పెట్టుకున్న అభ్యర్థులకు ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సర్టిఫికేట్ లేకుంటే అడ్మిషన్ తిరస్కరించనున్నట్లు ఆమె తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు పోలీసు శాఖ

అంకితభావంతో పనిచేసి మెప్పు పొందండి
మహిళా భద్రతా విభాగం డీఐజీ రాజేశ్వరి

సంగారెడ్డి క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ క్రమశిక్షణకు మారుపేరని, అలాంటి శాఖలో పని చేస్తున్న వారు మంచి ప్రవర్తనతో ప్రజలకు సేవ చేయాలని మహిళా భద్రతా విభాగం డీఐజీ ఆర్.రాజేశ్వరి అన్నారు. కంది మండలం చిద్రుప్పలోని పోలీసు శిక్షణా కేంద్రంలో 224 మంది పోలీసు కానిస్టేబుళ్లు గురువారం శిక్షణ ముగించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి ఉన్నతాధికారుల, ప్రజల మెప్పు పొందాలని సూచించారు. నిరంతర అభ్యాసంతోనే జ్ఞానాన్ని పొందుతామని, ఈ శిక్షణా కాలంలో నేర్చుకున్న విషయాలను నిరంతరం నెమరేసుకుంటూ కొత్త కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. సంగారెడ్డి జిల్లాలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణను పూర్తి చేసుకున్న శిక్షణా పోలీసు కానిస్టేబుళ్లందరికీ తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు సేవ చేయడానికి పోలీస్ శాఖ ఒక చక్కటి అవకాశం అని, మీకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ విపత్కర పరిస్థితులలో పోలీసు శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటుందన్నారు. మహిళల భద్రతకు, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. ఎన్నో పండుగలు, ఉత్సవాలు, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటున్నామంటే అందుకు కారణం పోలీసు శాఖ అన్నారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో అంకితభావంతో పనిచేసి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సూచించారు. నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. హైదరాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన 224 మంది కానిస్టేబుళ్లు 9 నెలల శిక్షణ కోసం చిద్రుప్ప పోలీసు శిక్షణా కేంద్రానికి వచ్చారని, వీరందరికీ నూతన చట్టాలతో పాటు నేర విచారణ, ఇంటెలిజెన్స్, ఇంటర్నల్ సెక్యూరిటీ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర విషయాల గురించి నేర్పించడం జరిగిందన్నారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజలలో వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సంఘ విద్రోహ శక్తులకు ఎదురు నిలబడి సామాన్య ప్రజలలో ఒక భరోసా కలిపిస్తుందని అన్నారు. అంతకుముందు శిక్షణా కానిస్టేబుళ్ల నుంచి డీఐజీ రాజేశ్వరి, కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌లు గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి డీఐజీ రాజేశ్వరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, డీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావ్, వైస్ ప్రిన్సిపల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. పరేడ్‌కు శిక్షణా కానిస్టేబుల్ బాలకృష్ణ కమాండర్‌గా వ్యవహరించారు.


పరేడ్ కమాండర్ బాలకృష్ణకు బహుమతి అందజేస్తున్న డీఐజీ రాజేశ్వరి, కలెక్టర్ క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్


శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల పరేడ్

ఒకే కుటుంబం నుంచి ముగ్గురు..

కల్హేర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మూరుమూల గిరిజన తండాలో జన్మించిన ముగ్గురు యువకులు సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని గురువారం పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి కొత్తకుంట తండాకు చెందిన వీరు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. తండాకు చెందిన దేవసోత్ దేవిజ్యానాయక్, వాలీబాయి దంపతుల ఇద్దరు కుమారులు విఠల్, వెంకటేష్‌తోపాటు దేవిజ్యానాయక్ తమ్ముడు చంద్యానాయక్ కుమారుడు హర్షవర్ధన్‌లు ఈ ఘనత సాధించారు. ఈ ముగ్గురు గురువారం శిక్షణ పూర్తి చేసుకుని నల్గొండలో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు.


పాసింగ్ అవుట్ పరేడ్‌లో అన్నదమ్ములు విఠల్, వెంకటేష్

న్యాయం చేయండి..

- పోలీస్‌స్టేషన్ ఎదుట గిరిజనుల ఆందోళన
- చనిపోయిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ ఘటనలో బాధితులు


పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

నర్సాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో కేసు నమోదైన వారితో పాటు వారి కుటుంబీకులకు న్యాయం చేయాలని గిరిజనులు గురువారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మండలంలోని వనా రాయణపూర్ పంచాయతీ పరిధిలో ఓ భూ వివాదంలో శ్రీనివాస్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు గిరిజనులపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. అందులో ఒకరు మృతి చెందగా, ఈ విషయమై జిల్లా ఎస్పీతోపాటు సీఐ, ఎస్ఐలు కూడా వివరణ ఇవ్వాల్సి వచ్చింది. అయితే ఫిర్యాదు చేసిన శ్రీనివాస్‌పై కూడా తాము ఫిర్యాదు చేయగా, వారిపై కేసు నమోదు చేయలేదని ఎఫ్ఐఆర్‌తో దేవిసింగ్, ఆంజనేయులు, సూర్యలు తమ కుటుంబాలతో కలిసి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. చనిపోయిన వ్యక్తి పేరు ఎఫ్ఐఆర్‌లో రాసిన విషయాన్ని పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. అయితే, ఈ విషయం బయటపడకుండా పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని 'అనుమతి లేకుండా నిరసన తెలపడం తగదు' అంటూ వారిని పంపించే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని బయట ఎవరికీ చెప్పవద్దని వారిని సూచించినట్లు సమాచారం. కానీ, విషయం సాయంత్రానికి బయటపడింది.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



జహీరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో దోషిగా తేలిన ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. భవానీచంద్ర గురువారం తీర్పు వెలువరించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు చెందిన పవార్ రాజు మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా నీలం పట్టణానికి చెందిన పవార్ శ్రీకాంత్ వద్ద రూ.10వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించాలని శ్రీకాంత్.. పవర్ రాజుపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు 2024 ఆగస్టులో జహీరాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన పవర్ రాజును హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చనిపోయాడు. అతని తల్లి పవార్ గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు జహీరాబాద్ సీఐ రాజు, ఎస్ఐ శ్రీకాంత్‌లు కేసు దర్యాప్తు చేశారు. నిందితుడు పవార్ శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. ఈ కేసుకు సంబంధించి గురువారం తుది విచారణ జరగింది. పూర్వపరాలు పరిశీలించిన జిల్లా న్యాయాధికారి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేసిన సీఐ రాజు, ఎస్ఐ శ్రీకాంత్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, ప్రస్తుత పట్టణ ఎస్ఐ కాశీనాత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ తదితరులను జిల్లా ఎస్పీ రూపేష్ అభినందించి రివార్డులను ప్రకటించారు.

జహీరాబాద్‌లో వ్యక్తి హత్య
తలపై బండరాయితో మోది..

జహీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానం వెనుక భాగంలో రైల్వే ట్రాక్ వద్ద 35-40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తిని బుధవారం రాత్రి దారుణంగా హత్య చేశారు. అతడి తలపై బండరాయితో కొట్టి చంపేసినట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. విషయాన్ని తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ శివలింగంలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలాలను రప్పించినప్పటికీ ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్య ఎందుకు జరిగింది. ఎవరు చేశారు. అన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి సబంధించి సమాచారం ఉంటే పట్టణ పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

ప్రాణాలు తీసిన విద్యుత్ కంచె
కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

ఝరాసంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలానికి అక్రమంగా వేసిన విద్యుత్ కంచె ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. దారిన వెళ్తున్న వ్యక్తి దాహర్తి తీర్చుకునేందుకు వెళ్లగా.. కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చీల మామిడి శివారులో గురువారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. దేవరంపల్లి గ్రామానికి చెందిన నసీర్(42) గ్రామంలో వ్యవసాయం చేస్తుంటాడు. గురువారం పని మీద చీలమామిడి శివారులోకి రాగా, దాహం వేసింది. రోడ్డు పక్కన ఓ పొలంలో దాహం తీర్చుకునేందుకు వెళ్లాడు. అయితే, ఆ పొలాన్ని పందుల నుంచి రక్షణ కల్పించేందుకు రైతు పొలం చుట్టూ ఇనుక కంచె ఏర్పాటు చేసి, విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. విషయం తెలియన నసీర్ అటుగా వెళ్లడంతో షాక్ తగిలి చనిపోయాడు. నసీర్ కుమారుడు అఫ్రోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


యువతి అదృశ్యం



రేగోడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేగోడ్ మండలం చౌదరిపల్లిలో ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్.ఐ పోచయ్య గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన బాస్కా శ్రావణి (20) ఈ నెల 8 నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి సాయిలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



చలికాలం.. గుండె పదిలం



అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

సిద్దిపేట అర్బన్/ కొండపాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చలి గాలులు మొదలయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గుండెను కొంచెం పదిలంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గే కొద్ది రక్త సరఫరా తగ్గిపోవడంతో గుండె జబ్బులు, నరాలకు సంబంధించిన జబ్బులు పెరిగే అవకాశం ఉంటుంది. చలిలో ఎక్కువగా తిరగడం వలన గుండె రక్తనాళాల్లో బ్లాక్ ఉన్నవారికి, కొలస్ట్రాల్ ఎక్కువ ఉన్నవారికి, అధిక బరువు ఉన్న వారికి గుండె సరఫరా చేసే నాళాల్లో పగుళ్ల ఏర్పడి గుండె జబ్బుల బారిన పడే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కొన్నిసార్లు అతి చలితో ఇన్ఫెక్షన్ ఏర్పడి గుండెకు పెనుముప్పు వాటిల్లే అవకాశం కూడా ఉంటుంది. చల్లని వాతావరణంలో ఆరోగ్యంగా ఉండటం కోరోనరీ ఆర్టరీ డిసీజ్ (సీఐడీ) ఉన్న వారిలో గుండె కండరాలకు తగినంత ఆక్సిజన్ అందకపోతే చల్లని ఉష్ణోగ్రతలు కార్డియాక్ ఇష్కీమియాను ప్రేరేపించి గుండె జబ్బులకు దారితీస్తాయి. చల్లని ఉష్ణోగ్రతలు రక్తనాళాలను కుంచించుకుపోయేలా చేయడంతో గుండెకు సరఫరా అయ్యే రక్తంలో సమస్యలు ఏర్పడతాయి. రక్తపోటు పెరిగి ఇరుకైన రక్తనాళాల ద్వారా రక్తాన్ని పంప్ చేయడానికి గుండె కష్టపడాల్సిన ఆవశ్యకత ఏర్పడి రక్తనాళాల సమస్య ఏర్పడుతుందని చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చల్లని వాతావరణంలో బయటికి వెళ్తే.. వెచ్చని దుస్తులు ధరించాలి. తలకు, చేతులకు సాక్స్‌ల లాంటివి ధరించాలి.
- తెల్లవారుజామున మంచు కురిసే సమయంలో అతి చలిగా ఉన్నప్పుడు వాకింగ్ చేయడం కూడా అంతగా మంచిది కాదు.
- అతిగా మద్యం సేవించకుండా పరిమితం చేసుకోవాలి. ముఖ్యంగా గుండె జబ్బులు ఇంతకుముందే ఉన్న వ్యక్తులు చల్లని వాతావరణానికి చాలా జాగ్రత్తగా ఉండాలి.
- మధుమేహం, ఆస్తమా, అధిక బరువు ఉన్న వారు అతి చలిలో వాకింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- చలికాలంలో మద్యపానం, ధూమపానంకు దూరంగా ఉండాలి. ఊపిరితిత్తుల, కిడ్నీ బాధితులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంటుంది.
- చల్లటి ప్రదేశంలో పడుకోకుండా గోరువెచ్చటి నీటితో స్నానం చేసి వెచ్చగా ఉండేలా చూసుకోవాలి.
- రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారు చలికాలంలో జబ్బుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది, అలాంటివారు పౌష్టికాహారం తీసుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

పిల్లలు, వృద్ధులు వేడి దుస్తులు ధరించాలి

చలికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా వేడిగా ఉండే దుస్తులు ధరించాలి. చలికాలంలో ఎక్కువగా చర్మ సమస్యలు వేధిస్తుంటాయి. చర్మం పొడిబారుతుంది. పెదాలు తడి ఆరుతాయి. పగులుతాయి. చర్మంపై దురద దద్దుర్లు వస్తుంటాయి. మంచి నాణ్యతగల లోషన్‌లను వాడాలి. కొబ్బరి నూనెను పెదాలకు చర్మానికి రాసుకోవాలి. జ్వరం, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ అమిరిశెట్టి భాస్కర్, లోహిత్ సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, సిద్దిపేట

జాగ్రత్తలు తీసుకోవాలి



తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల గుండెను ఆరోగ్యంగా కాపాడుకోవడంతో పాటు గుండెపోటు మరణాల సంఖ్యను తగ్గించే అవకాశం ఉంటుంది. కార్డియాక్ ప్రాబ్లం ఉన్నవారు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి. కొలెస్ట్రాల్, ఈసీజీ టుడీ ఈకో వంటి పరీక్షలు చేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మరి అవసరమైతే తప్ప గుండె జబ్బులు ఉన్న వ్యక్తులు ఉదయం, సాయంత్రం సమయాల్లో బయటికి రాకూడదు. ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న సమయంలో రక్తనాళాలు సంకోచ, వ్యాకోచాలకు గురవుతాయి. అందువల్ల తెల్లవారుజామున చలి ఎక్కువగా ఉన్నప్పుడు వాకింగ్ చేయకూడదు. స్మోకింగ్, మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి.

- డాక్టర్ ఆనంద్ రాజ్, కార్డియాలజిస్ట్, మెడికేరిచ్ హాస్పిటల్, సిద్దిపేట

నేడు మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలో కూనంనేని పర్యటన

● శివలింగు కృష్ణ

గజ్వేల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ పునరావాస కాలనీలో నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పర్యటించనున్నట్లు గజ్వేల్ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి శివలింగు కృష్ణ తెలిపారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను తెలుసుకోనున్నారని, త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో పునరావాస కాలనీ సమస్యలపై గళం విప్పుతారన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కొండ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కొక్కొండ సబ్‌స్టేషన్ 33 కేవీ మరమ్మతుల దృష్ట్యా కొత్తూరు, కొక్కొండ, సింగన్నగూడ, శ్రీరాంపూర్ గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యమపాశాలుగా విద్యుత్ తీగలు

● చేతికందే ఎత్తులో వేలాడుతున్న వైనం
● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని విద్యుత్ అధికారులు, సిబ్బంది
● ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యమే

అక్కన్నపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రాణాలు పోతున్నా విద్యుత్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కుందనవానిపల్లిలో వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ఎప్పుడు కింద పడి పోతాయో అన్న చందంగా తయారయ్యాయి. వ్యవసాయ బావుల వద్ద రైతులు పత్తి, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. మనిషికి తాకే ఎత్తులో విద్యుత్ తీగలు అత్యంత ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వరి నాటు వేసే ముందు, వరి కోత కోసేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి పనులు చేసుకోవాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. పొలాల వద్ద జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలను చూసి పని చేసుకోవాలంటేనే భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి ఈదురు గాలులు వీచినప్పుడు తీగలు ఒకదానికొకటి తాకి నిప్పురవ్వలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటి పూట ఎలాగోలా తమ పనులు చేసుకుంటున్నా రాత్రివేళల్లో మూగజీవాలు, రైతులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందటున్నారు. ప్రతి సంవత్సరం విద్యుత్ తీగలతో తరచూ మూగ జీవాలు, రైతులు ప్రమాదాల బారిన పడుతున్నా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మండలంలోని కుందనవానిపల్లిలో చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు



విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పాత స్తంభాలు శిథిలావస్థకు చేరి పక్కకు ఒరిగి పడిపోయే స్థితిలో ఉన్నా విద్యుత్ సిబ్బంది రావడం లేదు.విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

- ఏలేటి రాజిరెడ్డి, రైతు, కుందనవానిపల్లి

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామ్‌దేని కనకయ్య (44) కొన్ని నెలల క్రితం అప్పు చేసి మేకలను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నాడు. తనకున్న ఎకరం పొలంలో రెండు బోర్లు వేసినా నీరు పడలేదు. కూతురి వివాహం చేయడానికి కూడా డబ్బులు లేవని చాలాసార్లు తన భార్యతో చెప్పుకుంటూ బాధపడేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కూతురు కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య రామ్‌దేని భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై..


బాలనర్సయ్య (ఫైల్)

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జగదేవ్‌పూర్‌లో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిగడపకు చెందిన రొయ్యల బాలనరసయ్య(45) అనే వ్యక్తి కుటుంబంతో కలిసి కొంత కాలం క్రితం జగదేవ్‌పూర్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన అతడు గురువారం ఇంట్లో ఉరేసుకని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సిద్దిపేట అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారులోని బ్రిడ్జ్ వద్ద అక్రమంగా తరలిస్తున్న సుమారు 53.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా 85 సంచుల్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. ఆకునూరు గ్రామానికి చెందిన శేఖర్ (డ్రైవర్)ను విచారించినా ఎలాంటి రసీదులు చూపకపోవడంతో బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'ప్రజా సమస్యల పరిష్కారం కాంగ్రెస్‌తోనే సాధ్యం'

గజ్వేల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తెలంగాణ సంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల ప్రచార రథాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఆయనవెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు నర్సింహరెడ్డి, వహీద్‌ఖాన్ తదితరులున్నారు.

రూ. 6 వేల పింఛన్ సాధనకు దివ్యాంగుల రిలే నిరాహార దీక్షలు

హుస్నాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ. 6 వేల పింఛను అమలు చేయాలని హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి పెండెల సమ్మయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుగులోతు రాజేశ్వరి, చిరబోయిన రమేశ్, వెంకటలక్ష్మీతో పాటు పలువురు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

● మత్స్యకారుల దినోత్సవంలో నాయకులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా నాయకులు పెండ్యాల అయిలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని పోతారం(ఎస్)లో ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మండల మహాసభ అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్, పోతారం(ఎస్) మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు సున్నపు రమేష్, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు పొన్నం మల్లయ్య, వివిధ గ్రామాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్ రూరల్: ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి తోడ్పడాలని బీఆర్ఎస్ నాయకుడు, లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ మర్కంటి కనకయ్య ముదిరాజ్ అన్నారు. గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. నవంబరు 21న మత్స్యకారుల దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారన్నారు.

● బెజ్జంకి: ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

● సిద్దిపేట కల్చరల్: ప్రపంచ వ్యాప్తంగా మత్స్య అభివృద్ధి అవసరమని, చేపల ఉత్పత్తిని పెంచాల్సిన అవసరముందని జిల్లా మత్స్యశాఖాధికారి వరదారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిషరీస్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ ఆయోధ్యరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి గోపాల సుదర్శనం, అధ్యాపకులు హేమలత, మధుసూధన్‌రెడ్డి, జగదీశ్వరాచారి, పుణ్యమ్మ, వైకుంఠం, రామ్‌కుమార్, వెంకటేశ్, చక్రవర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.


బెజ్జంకిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ప్రజాసంకల్ప దీక్ష వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చేర్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 30న చేర్యాలలో చేపట్టనున్న ప్రజాసంకల్ప దీక్షను విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాలను గురువారం జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేఏసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ మాట్లాడారు. చేర్యాల పూర్వవైభవ సాధనకు పోరాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు పుర్మ ఆగంరెడ్డి, తోకల ఉమారాణి, అందె అశోక్, అందె బీరయ్య, ఉమారెడ్డి, అంకుగారి శశిధర్ రెడ్డి, తడక లింగమూర్తి, చెరుకు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని దాచారం ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతంగా చదివి భవిష్యత్‌లో రాణించాలన్నారు. అనంతరం తోటపల్లిలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఏంఈవో మహతి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే సత్యనారాయణ

మేకలను స్లాటర్ హౌజ్‌లోనే వధించాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట టౌన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మటన్ వ్యాపారస్తులు స్లాటర్ హౌజ్‌లోనే మేకలను వధించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. పట్టణంలోని 13వ వార్డులో గురువారం ఆయన పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉదయాన్నే పారిశుధ్య కార్మికుల హాజరు తీసుకున్న వెంటనే వార్డులోకి వెళ్లి సమస్యలను పరిష్కరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌ను ఆదేశించారు. మేకలను ఇరుకోడ్ వద్ద ఉన్న స్లాటర్‌లో మాత్రమే వధించి అక్కడి డాక్టర్లతో మున్సిపల్ ముద్రను వేయించుకుని మాంసం విక్రయించాలని మాసం విక్రేతలను ఆదేశించారు.


సిద్దిపేటలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

● గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు


ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలోని కొండపోచమ్మ ఆలయంలో 23వ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండోరోజు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం పాతకాల పూజ, మూలమంత్రహోమం, స్థాపితా దేవతా పూజ, సామూహిక కుంకుమార్చన, మంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హరిబాబు, ఆంజనేయులు, చిన్న యాదగిరి తదితరులు ఉన్నారు. నేడు శివపార్వతుల కల్యాణం ఉంటుందని, అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు.

కొండపోచమ్మ పునరుజ్జీవ కమిటీ నియామకం

జగదేవ్‌పూర్: కొండపోచమ్మ అమ్మవారి ఆలయ పునరుజ్జీవ కమిటీని నియామకం చేస్తూ గురువారం దేవాదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పునరుజ్జీవ కమిటీ సభ్యులుగా మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన మండే ఆగమల్లు, మాందాపూర్‌కు చెందిన లింగాల వజ్రమ్మ, రాంనగర్‌కు చెందిన కోట ఆశయ్య, బిజీ వెంకటాపూర్‌కు చెందిన లింగాల నరేశ్‌ను నియమించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒకరోజు శిక్షణ

మద్దూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎండీ ఎజే రహీం మాట్లాడారు. డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై నేడు రైతులకు అవగాహన

● మండల వ్యవసాయశాఖ అధికారి సాయికిరణ్

దౌల్తాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో అయిపామ్ సాగు చేసిన రైతులకు దౌల్తాబాద్ రైతు వేదికలో నేడు ఉదయం 10 గంటలకు ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యసాయాధికారి సాయికిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు తరలిరావాలని ఆయన కోరారు.



కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని ముఖమండపంలో చేపట్టిన కార్తీక దీపోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం సర్ప ఆకారంలో వెలిగించిన దీపాలు

-చేర్యాల

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

● మంత్రి పొంగులేటికి వినతి



చేర్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గురువారం రాష్ట్ర రెవెన్యూశాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. చేర్యాల, కొమరవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాల ప్రజలు ప్రభుత్వపర సేవల నిమిత్తం ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు వెళుతూ ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఈ విషయమై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు.

ప్రయాణికుల భద్రతకు 'అభయ'

● చేర్యాల సీఐ ఎల్. శ్రీను


ఆటోలకు అభయ యాప్ స్టిక్కర్లు అంటిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అభయ యాప్ ప్రయాణికుల భద్రతకు దోహదపడుతుందని చేర్యాల సీఐ ఎల్. శ్రీను అన్నారు. కొమురవెల్లి మండలంలో ప్రయాణికులను చేరవేసే ప్రైవేటు ఆటో డ్రైవర్లకు గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో అభయయాప్ పనితీరుపై వివరించి వాహనాలకు స్టిక్కర్లు అంటించిన సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడారు. ఆటోలో ప్రయాణించే సమయంలో ప్రయాణీకులు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయాలని, తద్వారా ఆటో, డ్రైవర్ వివరాలు తెలయడంతో పాటు జీపీఎస్ ద్వారా ఆటో ప్రదేశం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యల తిష్ఠ

5వ పేజీ తరువాయి

ప్పటికీ కోతులు పైపులైన్‌ను తరుచూ పాడుచేస్తున్నాయి

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి



హస్టల్‌లో అసంపూర్తి వసతులతో 50 మందికే సౌకర్యం అందుతుంది. ప్రస్తుతం 82 ఎన్‌రోల్‌మెంట్‌కు 76 మంది ఉన్నారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తే 100 మందికి ఉపయోగపడనుంది.

- సీహెచ్. జ్యోతి, హాస్టల్ వార్డెన్

చాలా ఇబ్బందిగా ఉంది



ప్రభుత్వం భోజన వసతితో పాటు కేవలం షల్టర్ మాత్రమే సమకూర్చింది. ప్రతియేడు కార్పెట్స్, బెడ్‌షీట్స్, కాస్మోటిక్ చార్జెస్ ఇవ్వడం లేదు. ఇంటి వద్ద నుంచే సమకూర్చుకుంటున్నాము. చాలా ఇబ్బందిగా ఉంది.

-జి. అన్విత, సెకండ్ ఇయర్


పై అంతస్తులో అసంపూర్తి గదులలో కిటికీలకు బిగించని ఐరన్‌జాలీ, తలుపులు



చిన్నకోడూరు మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ సమీపంలో మిషన్ భగీరథ పైపులైను గేటు వాల్వ్ పక్క నుంచి నీరు లీకేజీ అవుతున్నది. సుమారు వారం రోజులుగా నీరు వృథాగా పోతున్నది. లీకేజీతో నీరు కలుషితమై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ సిబ్బందికి సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

- చిన్నకోడూరు

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి పరీక్షలు

● మండల విద్యాధికారులు

దూళిమిట్ట,నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకిముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు దూళిమిట్ట ఎంఈవో మీనాంజనేయులు తెలిపారు. దూళిమిట్ట ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి చెకిముకి పోటీల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కుకునూరుపల్లి: మండలంలో నిర్వహించిన చెకుముకి పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

● సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట పట్టణంలోని ఎన్‌జీవోస్ భవన్‌లో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను రూరల్ మండల విద్యాధికారి కొత్త రాజిరెడ్డి ఆవిష్కరించారు. చెకుముకి పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అర్బన్ మండల విద్యాధికారి రాజ ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపికలు, ప్రశాంసపత్రాలు అందజేశారు.


మద్దూరు: చెకుముకి పోటీ పరీక్షల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

● గజ్వేల్: గజ్వేల్ మండలస్థాయి చెకుముకి పోటీల్లో గెలుపొందిన వారికి గజ్వేల్ మండల విద్యాధికారి వై.కృష్ణ బహుమతులు అందజేశారు.

● చేర్యాల: చేర్యాల బాలికల జడ్పీఎస్ఎస్‌లో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు ఎంఈవో రచ్చ కిష్టయ్య బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి మాట్లాడారు.


కుకునూరుపల్లి: విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంఈవో బచ్చలి సత్తయ్య

● మర్కుక్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెకుముకి పోటీలు నిర్వహించారు. విజేతలకు మండల విద్యాధికారి వెంకట్‌రాములు ప్రశంసాపత్రాలను అందించారు.

● జగదేవ్‌పూర్: మండలంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పరీక్షలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ఎంఈవో మాధవరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

కరెంటు కోతలు

5వ పేజీ తరువాయి

మాత్రం స్పందించడం లేదు. గ్రామాల్లో, పట్టణాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఆయా ప్రాంతాల వారికి వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టి చేతులుదులుపుకుంటున్నారు. ఆ తర్వాత ఎన్నిగంటల మేర పనులు జరిగాయి.. ముందస్తుగా చెప్పిన సమయానికి కంటే ఎక్కువగా కరెంటు కోతలు ఎందుకు అవుతున్నాయన్న విషయమై దృష్టిసారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గంటల తరబడి కరెంటు కోతలు ఏర్పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, కరెంటు కోతల విషయమై ఆంధ్రజ్యోతి సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు.

24 గంటలు విద్యుత్‌నందించాలి



ప్రభుత్వం 24 గంటల పాటు విద్యుత్ ససరఫరా చేస్తున్నట్లు భావిస్తున్నది. వాస్తవానికి ప్రతిరోజూ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ మెయింటనెన్స్ పేరిట కరెంటు సరఫరా కావడం లేదు. ఉదయం స్నానం చేసి ఆఫీసుకు వెళ్దామంటే కరెంటు లేకపోవడం వల్ల ట్యాంకులో నీళ్లు ఉండడం లేదు. గృహిణులకు కూడా వంట చేసే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి కోతలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలి.

- ఇరుకుల అభిలాష్, స్థానికుడు